

# సముద్రం

రమణజీవి

నేను పిచ్చాసుపత్రిలో ఉన్నప్పుడు వచ్చింది ఆ ఈ మెయిల్. ఒక పత్రికవాళ్లు పంపింది. ప్రత్యేక సంచికకు కథ రాయమని. మా ఆవిడ చెప్పింది నాకా విషయం. ఆమె నేను ఆసుపత్రిలో ఉన్న విషయం రహస్యంగా ఉంచింది.

ఒక్క మా పిల్లలకి మాత్రమే తెలుసు. నాకు పిచ్చెక్కిన సంగతి అందరికీ తెలియడం ఆమెకు చిన్న తనంగా అనిపించింది. కొంతకాలం చూసి బాగ్గాకపోతే అప్పుడు అందరికీ చెప్పొచ్చు అనేది ఆమె ఉద్దేశం.

నావేపు చూసింది. ఆ చూపులో చాలా అర్థాలతో పాటు కథ రాస్తారా అనే ప్రశ్న కూడా ఉంది.

'ఊ?' అంటూ తలతో అడిగింది వూపి.

పిల్లవాణ్ని గద్దించినట్టుగా ఉంది ఆమె ధోరణి.

"రాస్తాను కథ," అన్నాను.

"ఈ కండీషన్లోనా?" అంది ఆపిల్‌ని చేతిలోకి తీసుకుంటూ. "సరే సరే రాయండి మీకూ కాస్త ఛేంజ్‌గా ఉంటుంది."

'ఏ కండీషన్లో' అని గొడవ పెట్టుకుందామని నోటి దాకా వచ్చి ఊరుకున్నాను. పిచ్చివాళ్లు చేసే మొదటి వాదన తమకి పిచ్చి లేదనిట.

"రాయను. చెబ్తాను. నువ్వు రాసి పెడతావా?"

తల ఊపింది అంగీకారంగా.

"పెన్నుతో రాయాలి అయితే..." అన్నాను.

అదోలా చూసింది. నేను రాబోతున్న కోపాన్ని ఆపు కున్నాను.

నేను కథలు చెప్పి ఇప్పటికి చాలాకాలం అయింది. వీడియో క్యాసెట్ ప్లేయర్లు కొత్తగా వచ్చిన రోజుల్లో అనుకుంటా, పిల్లల్ని పోగేసి కథలు చెప్పేవాణ్ణి.

పిల్లలకు కథలు చెప్పడంలో హుషారుని అనుభ వించాల్సిందే! పెద్ద గొంతుతో జంతువులాగా అరవొచ్చు. ఇష్టమొచ్చినట్టు గెంతొచ్చు. అప్పట్లో నన్నెవరూ అంత పెద్దగా గమనించినట్టు లేదు. లేకపోతే అప్పుడే పిచ్చాసు పత్రిలో వేసేవాళ్లు.

నేను చెప్పిన కథల్లో ఎలాంటి ప్రత్యేకతా అయితే ఉండేది కాదు. చాలామంది చెప్పేలాంటివే. వింటున్న పిల్లల్నే కథలో హీరోల్ని చెయ్యడం, ప్రజల్ని చంపుకు తినే ఓ రెండు తలల రాక్షసుణ్ని గెలవడం, ఒక పెద్ద మృగం లేదా ఏ గ్రహాంతరవాసుల బారి నుండో ఈ ప్రపంచాన్ని రక్షించడం... ఇలాంటివే.

కథలు చెప్పడంలోని ఆనందంతో పాటు, పిల్లల్తో కాళ్లు తొక్కించుకునే ప్రతిఫలాన్ని కూడా ఆశించేవాణ్ని. పిల్లలు అలా తొక్కుతుంటే నిద్రలోకి జారిపొయ్యేవాణ్ని.

పిల్లలు తొక్కడం మానినా, తిక్కతిక్కగా తొక్కినా నా నోరు టక్కున మూతపడేది. ఒక్కోసారి రివైండయి కథ మొదటి నుంచీ ప్రారంభమయ్యేది. ఇంకోసారి కథ ఒక్కసారిగా చివరికి వెళ్లిపోయేది. పిల్లలకు వెంటనే తెలిసిపోయేది తాము చేసిన తప్పు. గోలగోల చేసి మళ్లీ శ్రద్ధగా తొక్కడం ప్రారంభించేవాళ్లు. పిల్లల ముందు వీసీపీగా నన్ను నేను అభివర్ణించుకున్న ఆనాటి కథల వ్యవహారం అది.

ఇది పెద్దల కోసం చెబుతున్న కథ. కాస్త ఒళ్లు దగ్గరుంచుకోవాలి. పిల్లలంత తేలిగ్గా మోసపోవడానికి సిద్ధంగా ఉండరు పెద్దవాళ్లు.

*

వారం నించి రోజూ వస్తోంది ఆ కల.

అతడు అంతవరకూ అటువంటి కలను ఎరగడు.

అపార జలరాశి కనుచూపు మేరదాకా! పొగ మంచులో కలిసిపోయిన అంతులేని తీరం ఎన్ని యోజనాలుందో ఎవరికీ తెలీదు. ఏవేవో పక్షులు. ఒడ్డంతా ఇసుక పిండి. ఆ అనంత జలరాశికి ఊపిరితిత్తులు కనక ఉంటే, అవి తీసే శ్వాసలాగే వుంది, దాని నిరంతర హోరు. దేవుడు తనకోసం చేసుకున్న అద్దంలా తళతళా మెరిసిపోతున్న ఆ దృశ్యం ఎవరూ ఊహించడానికి వీల్లేనిది.

చాలామంది పండితుల్ని సంప్రదించి చాలా గ్రంథాల్ని పరిశోధించాక దాన్ని సముద్రం అంటారని తెలిసింది అతడికి. అది ఎంతో దూరంలో భూగోళానికి అవతలి వైపు ఉంటుందదట!

ఎప్పుడైతే దానికొక పేరు ఖాయం అయిందో, అప్పణ్నించి ఆ కల రావడం మానేసింది. సముద్ర స్వప్నం కోసం ఎదురుచూసి ఎదురుచూసి నిస్సారంగా గడుస్తున్నాయి అతడి రోజులు.

రాజుని చూసిన కళ్లతో మొగుణ్ని చూసినట్టుంది మిగతా లోకం అతడికి. నిజానికి అతడే ఓ రాజు.

దేశంలోని మహాపర్వతాలు, దుర్గమారణ్యాలు, నేలను తాకేంత దగ్గరగా సాగిపోయే మేఘాల గుంపులు, జలపాతాలు, విశాల జలాశయాలు అతణ్ణి తృప్తిపరచలేకపోతున్నాయి. పదేపదే ఆ సముద్ర దృశ్యం గుర్తొచ్చి అతణ్ణి నిర్వీర్యుణ్ణి చేస్తోంది.

సముద్రం ఎలాగైనా ఉండాల్సిందే!

దేశాధినేతగా అతడి ప్రజలకు ఇవ్వగలిగిన బహుమతేదైనా ఉంటే అది సముద్రమే. అంతకన్నా గొప్పది ఈ సృష్టిలో మరొకటి లేదు. ఈ నిర్ణయానికి రావడానికి చాలా సమయాన్నే తీసుకున్నాడు. ఎన్నో వైపుల్నించి ఆలోచించాల్సిన బాధ్యత అతడిది.

ఓరోజు కిక్కిరిసిన సభలో తన నిర్ణయాన్ని ప్రకటించాడు. ఆ ప్రకటనకు ముందే సముద్రాన్ని కళ్లకు కట్టినట్టు వర్ణించాడు. మహాసేనల్లాగా మునుముందుకు ఉరికే అలల గురించి చెబుతున్నప్పుడు అందరూ ఊపిరి తీసుకోవడం మరిచిపోవడాన్ని అతడు గమనించాడు. అలల తుంపరల్లాగా లక్షలాది పక్షుల విహారాన్ని వివరిస్తున్నప్పుడు అందరి కళ్లలో చిప్పిల్లుతున్న వెలుగు రవ్వల్ని చూశాడు. అందరూ సముద్రపు హోరును తమ హృదయలయల్లోకి ఆవాహన చేసుకుంటున్న ఉత్తేజిత క్షణాల్లోనే అతడి నిర్ణయాన్ని ప్రకటించాడు అదను చూసి.

అందరూ ఉద్వేగంతో కెరటాల్లా లేచి నిలబడ్డారు. ఏవేవో నినాదాల ద్వారా తమ సమ్మతిని ప్రకటించారు. సముద్రపు హోరు అప్పుడే మొదలయినట్టుగా అనిపించింది దేశాధినేతకు.

సముద్రాన్ని తవ్వడానికి ఓ శుభ ముహూర్తాన్ని నిర్ణయించారు సిద్ధాంతులు. ముహూర్తానికి చాలా ముందే ప్రజలు తమ బంగారాన్నంతా ఖజానాకి అడగకుండానే ఇచ్చేశారు. భవిష్యత్ భయాన్ని సముద్ర కోరికతో జయించిన ప్రజలు.

బంగారమంతా ఇనుప గునపాలుగా మారింది.

"ఎంతోకాలంగా మనం సంపదని పోగు చెయ్యడానికి బతికాం. బతుకుతున్నాం. ఒక భరోసా తప్ప ఏమైనా ఉందా అందులో. ఇక నించి ఒక అనుభూతి కోసం బతకబోతున్నాం."

దేశాధినేత మనసు పరవళ్లు తొక్కుతోంది. "మనం చేస్తున్నపని ఈ భూమ్మీద ఎవరూ కల కూడా కనలేనిది."

"మనముందున్నది ఒకటే. తవ్వడం. మనం తవ్వుదాం. ఎప్పటికి పూర్తవుతుందో ఆలోచించడం మన పని కాదు. దాన్ని కాలం చూసుకుంటుంది. నీళ్లు ఎలా నింపాలా అనేది కూడా మన పని కాదు. దాన్ని ఆకాశం చూసుకుంటుంది. మన పని కేవలం తవ్వడం. ఇంత కాలం యుద్ధాల్ని ఎలా తెగించి చేశామో అలా చెయ్యడం," అంటూ గునపాన్ని నేలలోకి దించాడు దేశాధినేత.

కొన్ని లక్షల గునపాలు నేలవేపు దూసుకెళ్లాయి.

*

కళ్లు తెరిచాను.

నా భార్యాపిల్లలతో పాటు ఓ ఇద్దరు నర్సులు, అటెండర్లు చుట్టూ గుమిగూడి శ్రద్ధగా వింటున్నారు. అంతకు ముందురోజు నేను చెయ్యి చేసుకున్న అటెండర్ కూడా ఉన్నాడు వాళ్లలో. డబ్బుల్ని చింపనీకుండా అడ్డుకోవచ్చా నన్ను మరి?

కథను కొనసాగించాను కళ్లు మూసుకుని.

*

ఏళ్లు గడిచిపోతున్నాయి. ఆ తవ్వకం అలా సాగుతూనే ఉంది. దీక్ష ఏమాత్రం తగ్గలేదు. సముద్రాన్ని గుండెల్లో నింపుకున్నవాళ్లు మరి! ఆ పనిలో ఎంతోమంది మరణించారు. అయినా కొత్తవాళ్లు పుట్టుకొస్తూనే వున్నారు. దేశాధినేత వృద్ధుడయ్యాడు. అయినా తవ్వుతూనే ఉన్నాడు.

ఏదో తినడానికి ఇంత పండించుకోడం, అవసరమైనన్ని పశువుల్ని పోషించుకోవడం. మిగతా సమయమంతా సముద్రాన్ని తవ్వడం. అంతే!

ఈ విషయం చుట్టూ ఉన్న దేశాలకు నవ్వులాటగా తయారయింది. దాన్నొక పిచ్చివాళ్ల దేశంగా అనుకోవడం ప్రారంభించారు. ఆ దేశంలో బక్కచిక్కిన పశువుల దగ్గర్నించి, ఆధునీకరించబడని వాళ్ల ఆయుధాల

దాకా ఎన్నో సంగతులు నవ్వు తెప్పించే విషయాలుగా మారిపోయాయి.

ఇదే అదనుగా కొందరు ఆ దేశాన్ని ఆక్రమిద్దామని వ్యూహాలు చేశారు కానీ అక్కడ ఏముందని? ఒక పాడి లేదు. ఒక పంట లేదు. ఒక బంగారమూ లేదు. అంతా ఇనుముమయం!

ఈ వార్త అలా పాకి ఇలా పాకి దూరంగా ఉన్న సముద్రానికి తెలిసింది. మొదట్లో నమ్మలేదు. గాలి చెప్పే విషయాల్లో ఏదీ స్థిరంగా ఉండదు. వట్టి పోసుకోలు కబుర్లు. కానీ పక్షులు చెప్పాక నమ్మక తప్పలేదు ఆ సముద్రానికి.

ఆశ్చర్యపడింది మొదట. ఎంత పిచ్చాళ్లయినా ఇంత దుస్సాహసమా! క్రమక్రమంగా కోపంతో ఊగిపోయింది.

తనను తయారుచెయ్యడమా! తనెలా తయారయిందో ఇన్ని యుగాలైనా తనకే తెలీదే. తన చీకటి గర్భంలో చలించే మహా మహా జలచరాల్ని ఒడ్డునబడితే తప్ప తనే గుర్తించలేదే! సూర్యుడు కూడా చొరలేని అగాధాలను, పర్వతాలను, బడబాగ్నులను కడుపులో దాచుకున్న నిగూఢ గాథ కదా తను! దూరాల్ని కొలవడంలో మాత్రం గాలిని మించింది లేదు ఈ భూమ్మీద. వెంట్రుక మందంతో సహా కచ్చితంగా లెక్కించగలదు.

పిచ్చివాళ్ల దేశం ఎంత దూరముందో తెలుసుకుంది గాలి ద్వారా. తన కడుపుని అవసరమైనంత వేగంగా సుళ్లు తిప్పి కావలసినంత శక్తిని భుజాల్లోకి తెచ్చుకుని కుప్పించి ఎగిరి ముందుకు దూకింది సముద్రం. రెండు తాడిమానులంత ఎత్తున లేచింది. తీరప్రాంతాల్ని ముంచేస్తూ తన ప్రయాణాన్ని ప్రారంభించింది.

దూరం నించి చూస్తే లక్షలాది సముద్ర పక్షుల్ని, దట్టమైన మబ్బుల్ని వెంటేసుకుని జూలు విదిల్చి కదిలి వస్తున్న మహామృగంలాగా కనిపించింది సముద్రం. ప్రచండమైన తుఫాను గాలులు వృక్షాల్ని, కోటల్ని, జంతుజాలాన్ని కూల్చేసి, విసిరేసి, దాని దారిని శుభ్రపరుస్తూ ముందుగా పరుగులు తీస్తున్నాయి.

ఆ భీకర దృశ్యాన్ని చూసిన ఏ ప్రాణికీ కొన్ని నిమిషాల కంటే ఎక్కువసేపు జీవించే అవకాశం లేకపోయింది. అలాంటి అవకాశమే ఉండి ఉంటే, ఆ ఒళ్లు గగుర్పొడిచే అనుభవాన్ని తరాలకు తరాలు కథలు కథలుగా చెప్పుకునేవారు.

జనవాసాల్లోకి రావడం అదే మొదటిసారి సముద్రానికి. మానవ సమాజాల్ని చూసి విస్తుపోయింది. మనుషులు ఇంత ఇరుగ్గా జీవిస్తుంటారా అనే ఏవగింపుతోనే సాగింది దాని ప్రయాణమంతా. వాళ్ల ఇళ్లను చూసి... వాళ్ల దాపరికాల్ని చూసి...

ఏనుగుల్నే మచ్చిక చేసుకున్న ఈ ఆరడుగుల ప్రాణులు తనని మాత్రం బానిసని చేసుకోరా కాలం కలిసొస్తే! బానిసేం ఖర్మ, తనని సమూలంగా నాశనం చెయ్యగల నిక్షిప్తశక్తుల్ని కూడా ఆ చిన్న మానవ శరీరాల్లో పసిగట్టి కోపంతో రగిలిపోయింది సముద్రం.

దూరంగా ఉన్న లక్ష్యాల్ని ఛేదించే ఆయుధాల్ని చూశాక ఎన్ని అధర్మ యుద్ధాలకు పాల్పడబోతున్నాడో కదా అని మనిషి మీద ధుమధుమలాడింది. ఇంత అందమైన ప్రపంచంలో ఈ అత్యాశాపరుణ్ని సృష్టించడం వెనక దేవుడి ఆంతర్యాన్ని ప్రశ్నిస్తూనే సాగింది దాని పరుగు.

అలా ఎన్నో దేశాల్నీ అరణ్యాల్నీ నదుల్నీ జీవరాశుల్నీ పొట్టనబెట్టుకుంటూ ప్రయాణించిన సముద్రం చివరికి పిచ్చివాళ్ల దేశాన్ని సమీపించింది.

అదృష్టవశాత్తూ అప్పటికింకా సూర్యాస్తమయం కాకపోవడంతో పరిశీలనగా చూసే అవకాశం దొరికింది.

మిగతా దేశాల్లాగా పచ్చగా కళకళలాడుతూ లేదది. కొండల మీద అరకొర సాగుతో అక్కడక్కడ విసిరేసినట్టున్న పంటలు. దారుల మధ్యలో మొలిచిన ముళ్ల డొంకలు.

కొండచరియల మీద గూఢచారులు పహారా కాసే రక్షణ దుర్గాలు బోసిపోయి ఉన్నాయి. ఎక్కడా మనుషుల జాడ లేదు. దిక్కూమొక్కూ లేని దేశంలా ఉంది. సైన్య సంచారం ఏ కోశానా లేదు. ఒకటి రెండు తప్ప గాలిమరలన్నీ తుప్పపట్టి బిగదీసుకుపోయాయి. ఏ ఇంటికీ తాళాలు లేవు. పరిపాలనే లేని ఆ దేశాన్ని వెక్కిరిస్తున్నట్టుగా ఏవో చిన్నచిన్న మృగాలు ఇష్టారాజ్యంగా తిరుగుతున్నాయి. చనిపోయిన దేశంలా ఉంది.

అంత నిశ్శబ్దంలోనూ దూరాన్నించి ఏవో లోహాలకు చెందిన శబ్దాలు!

కొండల అవతల కొన్ని లక్షలమంది చీమల దండులాగా తవ్వే పనిలో నిమగ్నమై ఉన్నారు. నిజానికి ఆ కొండలన్నీ వాళ్లు తవ్వి పోసినవే.

''ఓహో! ఇక్కడన్నమాట సముద్రాన్ని తవ్వుతున్నది,'' తల పంకించింది సముద్రం. తన సహచరులందరికీ ఉష్ అని సైగ చేసి, నిశ్శబ్దంగా కొండల మీదుగా కాగితపు పొరలాగా పాకి తొంగిచూసింది. చంపే ముందు ఆ మతిలేనివాళ్లను దగ్గరగా చూడాలని దాని కుతూహలం.

అక్కడ ఎన్నో మైళ్ల విస్తీర్ణంలో ఓ మహా అగాధం. చిక్కటి నీడలు దాని నిండా. చూపు కూడా దూరలేనంత లోతుల్లోకి మాయమయిన మెట్లు అక్కడక్కడా.

ఆ అగాధపు వొడ్డున ఆవిరితో నీళ్లు తోడే యంత్రాల్ని చూసి ఆశ్చర్యపడింది సముద్రం. అంత వరకూ ప్రపంచంలో అటువంటి సాంకేతిక నైపుణ్యం లేదు. ఒక ఏనుగుతో వంద ఏనుగుల పనిని రాబట్టే వాళ్ల యంత్రానువాదానికి విస్తుపోయింది.

లావాటి మోకులు, ఇనుప గొలుసుల గందర గోళపు శబ్దాలు పరిసరాల నిండా. గణగణలాడుతూ అంతుబట్టని పనులేవో చేస్తున్న ఇనుపచక్రాలు. అర్థం చేసుకునేలోపే పెద్దపెద్ద బండరాళ్లు, మట్టి అలా జారుడుబల్లల మీదుగా కొండల మీదికి రాలి పోతున్నాయి.

కర్రలు, ఇనుము కాలిన వాసన ఎటు చూసినా. పొగలతో, దుమ్ముతో నిండిపోయిన ఆ ప్రాంతాన్ని ఇంత వరకూ ఏ దేశస్థులూ చూసిన పాపాన పోలేదు.

కొంతమంది యంత్రాల్ని నడుపుతుంటే, ఎంతో మంది ఒక శిల్పాన్ని చెక్కుతున్నంత శ్రద్ధగా తవ్వుతు న్నారు. సముద్రం తప్ప మరో ఆలోచన లేకపోవడం వల్ల బార్లా తెరిచిన వాకిళ్లలా ఉన్నాయి వాళ్ల మనసులు.

చెమట తుడుచుకోడానికి కూడా తీరిక లేనంతగా పనిలో మునిగి వున్నారు. ఒంటిమీద సరైన బట్టలు కూడా లేకుండా కఠోరంగా శ్రమిస్తున్న ఆ బక్క పలచటి మనుషుల్ని చూసి నిశ్చేష్టయైపోయింది సముద్రం.

వీళ్లా తనని తయారుచేసేది? కోపంతో కుతకుతా ఉడికిపోయింది.

జివ్వున ఆకాశంలోకి లేచింది. తన సహచరులతో కలిసి ఒక్కసారిగా ఫెళఫెళా ఉరిమింది.

ప్రపంచం ముక్కలయ్యేంత శబ్దం! ఆ శబ్దానికే సగంమంది గుండెలు పగిలి చావాలని సముద్రం ఉద్దేశం.

అందరూ గాభరాపడి తలలెత్తి చూశారు. వాళ్ల చేతుల్లో గునపాలు జారిపోయాయి. ఎక్కడి యంత్రా లక్కడ నిలిచిపోయాయి. ఏనుగులు కూడా భయంతో భీకరంగా అరిచాయి. అకస్మాత్తుగా సంభవించిన ఆ మహా ప్రళయానికి నేల కూడా కంపించింది.

అందరి కళ్లూ విభ్రాంతితో విచ్చుకున్నాయి. చలనం లేకుండా అలా నిలబడిపోయారు ఆ దృశ్యం ముందు. చిరకాల తమ తపస్సుకు నిజం సముద్రమే కరుణించిందా!

వేయి తలల సర్పంలా నించున్న సముద్రాన్ని, తలపాగాలా ఆవరించిన లక్షలాది పక్షుల్ని, మేఘాల్ని, యోజనాల మేరకు విస్తరించిన మంచుతీరాల్ని చూసి పారవశ్యంతో మోకాళ్ల మీద కూలబడిపోయారు.

వృద్ధుల్నీ యువకుల్నీ పిల్లల్నీ ఆడవాళ్లనీ తేరిపార చూసింది సముద్రం.

ఎన్నో యేళ్ల కల ఫలించిన సంతోషంతో చెమ్మ గిల్లిన కళ్లు. ఆపుకోలేని గగుర్పాటుతో వణుకుతున్న శరీరాలు.

కోపం స్థానంలో వాళ్లపట్ల ఆసక్తి చోటు చేసుకుం టోంది.

ఎండలకు కమిలిపోయిన వాళ్ల ఒంటిమీద ఖరీ దైన వస్త్రాలు లేకపోవచ్చు. నగలూ నట్రా లేకపోవచ్చు. కానీ ఒక అవిరామ దీక్ష వల్ల కాయలు కాసిన వాళ్ల అర చేతుల్నిండా పూలవాసన.

మెత్తబడింది సముద్రం.

అంతమంది తడి కళ్లలో ఉవ్వెత్తున మెరుస్తున్న తన లక్షల ప్రతిబింబాల్ని చూసి ముగ్ధురాలయింది. అంతవరకు తనని చూసి భయంతో పారిపోయినవాళ్లే తెలుసు దానికి.

తన్మయత్వంతో ఏదో గొణుగుతున్న వాళ్ల పెదవు ల్లోని ఆరాధనకు చలించిపోయింది. అద్భుతరసంలో తడిసి ముద్దవుతున్న వాళ్లను చూసి తనలోనూ ఏదో కరుగుతూ... కదులుతున్న రసం!

ఎప్పుడో మరిచిపోయిన తన హృదయం చప్పుడు చేస్తున్నట్టు పసిగట్టింది.

తన ప్రమేయం లేకుండా తనలోంచి ఉబికి ఉబికి వస్తున్న కొత్తనీటితో ఆ ప్రాంతం తడిసిపోయింది.

అయితే అది తన కన్నీరే అని తెలుసుకోవడానికి సముద్రానికి ఎంతో సమయం పట్టలేదు.

బరువుగా వెనుదిరిగింది.

ఆ కన్నీరే ఆ పిచ్చివాళ్ల దేశంలో సముద్రంగా మిగిలిపోయింది. అప్పట్నించే సముద్రపు నీరు ఉప్పగా మారింది.

*

ముగించాను. అందరూ నావేపే చూస్తున్నారు, రౌండ్స్‌కు వచ్చిన డాక్టరుతో సహా. ఆ గదిలోని ప్రతి కన్నూ ఒక సముద్రంలాగా తోచింది నా కంటికి.

*సాక్షి 'ఫన్ డే', 23 అక్టోబర్ 2011*